PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :201 | పేజీలు : 8 | వెల రూ.5 | గురువారం 13.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






# అదానీ కోసం.. లొంగిపోయారు

ప్రభాత సూర్యుడు

## దేశ ప్రయోజనాలను పణంగా పెట్టిన ప్రధాని మోదీ

**అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టి వేయడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. అదానీ కోసం ప్రధాని మోదీ రాజీ పడ్డారని దుయ్యబట్టారు. అదానీ కోసం దేశ ప్రయోజనాలను ప్రధాని పణంగా పెట్టారని ఆరోపణలు గుప్పించారు. రాజీ పడిన ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలను అమ్ముకోవాల్సి వచ్చిందని ఆరోపించారు. దీని వెనుక కంటికి కనిపించే దానికంటే చాలా ఎక్కువ ఉందని విమర్శించారు. అదానీ కోసం దేశం భారీ మూల్యం చెల్లిస్తోందని మండిపడ్డారు. గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టివేయడంపై వచ్చిన ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను రాహుల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ క్రమంలో మోదీ సర్కార్ తీవ్రంగా విరుచుకుపడ్డారు.**

- **విదేశీ అవినీతి చట్టం ఉల్లంఘనలకు పాల్పడ్డ అదానీ**
- **సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం పెద్ద మొత్తంలో లంచం**
- **భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 250 మిలియన్ డాలర్లు**
- **అమెరికా మార్కెట్లలో రుణాలు, బాండ్ల ద్వారా 300 కోట్ల డాలర్ల సమీకరణ**
- **పెట్టుబడిదారులను తప్పుదోవపట్టించే వ్యవహారం**
- **అమెరికా కోర్టులో క్రిమినల్ కేసు కొట్టివేత**
- **లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఘాటు స్పందన**

### విత్ ప్రెజుడిస్ పద్ధతి కింద కొట్టివేత

గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ మాజీ సీఈఓ వినీత్ జైన్‌లపై నమోదైన అభియోగ పత్రంలోని 2, 3, 4 అభియోగాలను కొట్టివేయాలని కోరుతూ న్యాయ శాఖ దాఖలు చేసిన రూల్ 48 (ఎ) అభ్యర్థనను ఆగస్టు 10న జారీ చేసిన 47 పేజీల ఉత్తర్వుల్లో న్యాయమూర్తి గరౌఫిస్ ఆమోదం చెప్పారు. ఈ అభియోగాల్లో సెక్యూరిటీల మోసం కుట్ర, వైర్‌ఫ్రాడ్ కుట్ర, సెక్యూరిటీల మోసం వంటివి ఉన్నాయి. ఈ అభియోగాలను 'విత్ ప్రెజుడిస్' పద్ధతి కింద న్యాయమూర్తి కొట్టివేశారు. అంటే ఈ అభియోగాలను మళ్లీ దాఖలు చేయడానికి వేల్లేదన్నమాట.

### అసలేంటీ కేసు?

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలపై అమెరికా న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఇరువురిపై ఉన్న క్రిమినల్ అభియోగాలను శాశ్వతంగా కొట్టివేస్తూ అమెరికా ఫెడరల్ న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. అదానీ, సాగర్‌లపై అభియోగాలు కొట్టివేయాలన్న న్యాయశాఖ అభ్యర్థనను న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్‌కు చెందిన అమెరికా జిల్లా న్యాయమూర్తి నికోలస్ గరౌఫిస్ ఆమోదం తెలిపారు.

### ఆ తీర్పు మాత్రం రిజర్వ్

అయితే విదేశీ అవినీతి నిరోధక చట్టం ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఉన్న మొదటి అభియోగంపైనా, న్యాయానికి ఆటంకం కలిగించడానికి కుట్ర పన్నారని ఆరోపిస్తున్న అయిదో అభియోగంపై న్యాయమూర్తి గరౌఫిస్ తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. ఈ రెండు అభియోగాల్లోనూ కోర్టుకు హాజరు కాని భారత్‌కు చెందిన అయిదుగురు సహ నిందితులు రంజిత్ గుప్తా, సిరిల్ కాబానెస్, సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, రూపేశ్ అగర్వాల్ ఉన్నారు. ఈ అభియోగాల కొట్టివేత ప్రాసిక్యూటర్ విచక్షణ మేరకు తీసుకున్నదే మినహా, ఆరోపణలపై ఇచ్చిన తీర్పు కాదని న్యాయమూర్తి గరౌఫిస్ స్పష్టం చేశారు. ఈ తీర్పును ప్రభుత్వ నిర్ణయంతో కోర్టు ఏకీభవిస్తున్నట్లుగా గానీ, కేసు యోగ్యతపై అభిప్రాయంగా గానీ ఎవరూ పొరపాటు పడకూడదని వ్యాఖ్యానించారు.

### అదానీపై లంచం ఆరోపణలు

2024 నవంబర్‌లో అదానీ, సాగర్ అదానీ, వీనీత్ జైన్ తదితరులపై అమెరికాలో క్రిమినల్ అభియోగాలు నమోదయ్యాయి. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలను దక్కించుకునేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 250 మిలియన్ డాలర్ల లంచాన్ని వీరు చెల్లించారనేది ప్రధాన ఆరోపణ. ఈ ఒప్పందాల ద్వారా రెండు దశాబ్దాల్లో పన్నుల అనంతరం 200 కోట్ల డాలర్లకు పైగా లాభాలు పొందే అవకాశం ఉందని అమెరికా ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లలో రుణాలు, బాండ్ల ద్వారా 300 కోట్ల డాలర్లకు పైగా సమీకరించే సమయంలో పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అదానీ గ్రూప్ మొదటి నుంచీ ఈ ఆరోపణలను ఖండిస్తోంది. తాము చట్టాలు, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించామని చెప్పింది. తాజాగా గౌతమ్ అదానీ సహా ఇతరులపై దాఖలైన క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టివేసింది.

# ఆర్మీ ఉద్యోగాలకు తెలంగాణ యువతను సిద్ధం చేస్తాం..


## లెఫ్టినెంట్ జనరల్‌తో సీఎం రేవంత్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దీనిపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ సానుకూలంగా స్పందించారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవనం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే..: జెన్‌జీకి మోదీ సలహా

ఢిల్లీ, ప్రభాత సూర్యుడు ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువత కు కీలక సూచన చేశారు. షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకుసాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఫుట్‌బ్రిడ్జ్‌లను వాడకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని మోదీ గుర్తుచేశారు. అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. “మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండి” అని సూచించారు. ఇటీవల కాలంలో మోదీ జెన్‌జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ మీడియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే.. Triumph of the Indian Re-



public: My Life, My Struggles పేరిట కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం ఢిల్లీలో జరిగింది.

# బిసి మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: పొన్నం

హైదరాబాద్, ప్రభాత సూర్యుడుబీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తమ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని గురువారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నట్లు చెప్పారు . లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయడం జరుగుతుందన్నారు.



# ఆశా కార్యకర్తపై మహిళ దాడి..

**ఆశా వర్కర్ల మీద దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవు...**






దుమ్ముగూడెం ఆగస్టు 12ప్రభాత సూర్యుడు: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కోయ నర్సాపురం గ్రామానికి చెందిన ముగ్రం మధులత విధుల్లో భాగంగా, ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమంలో లార్వా ను తొలగించడం, మరియు, అవగాహన పరచడం, వంటి కార్యక్రమం చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన,ఓ ఇంటి మహిళా యజమాని ఆశావర్కర్ పై దుర్భసలాడుతూ, తనపై కర్రతో దాడి చేసి గాయపరిచింది, ఈ ఘటనలో ఆశావర్కర్ కుడి మోచేతి జాయింట్ విరగడం జరింది..ఈ ఘటనపై ఆశ వర్క్ యూనియన్ ఆధ్వర్యంలో సదరు ఆశావర్కర్ పై దాడిచేసి గాయపరిచిన మహిళ పై లిఖిత పూర్వకంగా పిర్యాదు ను జిల్లా వైద్య అధికారికి అందచేశారు , సదరు మహిళా పై , క్రిమినల్ కేసులు పెట్టాలని ఎవరైనా ఆశ కార్యకర్తల పై దాడి చేస్తే, కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది పట్ల రక్షణ చట్టాలు అమలు చేయాలని , ఆశ కార్యకర్త లు కోరుతున్నారు...

# ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి**
**అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి**



మేడ్చల్ మల్కాజిగిరి, కలెక్టరేట్ ఆగస్టు 12ప్రభాత సూర్యుడు: ఖరీఫ్ 2026--27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, కొనుగోళ్లకు అవసరమైన మేర గన్నీలు అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులు ధాన్యాన్ని తడి, తాలు, దుమ్ము లేకుండా శుభ్రపరిచి, బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వరికోత సమయంలో హార్వెస్టర్ యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని ధాన్యం క్రమపద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ట్యాబ్ ఎంట్రీల్లో జాప్యం కారణంగా రైతుల చెల్లింపులు ఆలస్యం కాకుండా ప్రతి ఎంట్రీని అదే రోజు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో నిరంతరం సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎల్. సుగుణబాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎం.డి. రియాజ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**- ఎల్బీనగర్ డిసిపి డాక్టర్ అనురాధ**
**- పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో 'డ్రగ్-ఫ్రీ తెలంగాణ' అవగాహన**

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు

మాదకద్రవ్యాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బీ నగర్ డీసీపీ డాక్టర్ అనురాధ సూచించారు. మండల పరిధిలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభ్ ఫౌండేషన్, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ సహకారంతో 'డ్రగ్-ఫ్రీ తెలంగాణ' అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి అనురాధ మాట్లాడుతూ..డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలు, వాటి నివారణలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల బాధ్యతలను వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేస్తే డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టవచ్చని ఆమె పేర్కొన్నారు. వనస్థలిపురం ఏసీపీ పి. కాశిరెడ్డి డ్రగ్స్ నివారణ, చట్ట అమలు, అనుమానాస్పద కార్యకలాపాలను పోలీసుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సీహెచ్. శంకరయ్య విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.అనంతరం రిటైర్డ్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎం. శాంతరాజు మాట్లాడుతూ..నేరాలకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలు, పౌరుల హక్కులు, బాధ్యతలు, జువెనైల్ జస్టిస్, చట్టాన్ని గౌరవించడం, శిక్ష కంటే నివారణకు ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. హైకోర్టు న్యాయవాది సిద్దాల వెంకటేష్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు సముల రామ్ రెడ్డి ఎన్‌డీపీఎస్, పోక్సో, సైబర్ చట్టాలు, క్రిమినల్ కేసుల ప్రభావం, బాధితులు, నిందితుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కామినేని ఆసుపత్రి హెచ్‌ఓడీ డాక్టర్ హెచ్.ఆర్.వి. రాజ్‌కుమార్ మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ హరీష్ పిన్నలోజు పీర్ ప్రెజర్, డ్రగ్ అడిక్షన్, ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, సోషల్ మీడియా వ్యసనం, ప్రారంభ హెచ్చరిక సంకేతాలు, కౌన్సెలింగ్, పునరావాసం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ, పీజీఓఎస్, డీపీఎస్, పీఈసీ, ఎకోభారత్ సంస్థల చైర్మన్ మల్క కొమరయ్య, ఆయా సంస్థల సీఈఓ మల్క యశస్వి, శాలివాహన గ్రూప్, పీఈసీ, ఎకోభారత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మల్క నవీన్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు పోలీసు అధికారులు, న్యాయమూర్తి, న్యాయవాదులు, వైద్యులు, సైకియాట్రిస్ట్‌తో నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం అతిథులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు 'డ్రగ్-ఫ్రీ తెలంగాణ' ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పల్లవి ఇంజినీరింగ్ కాలేజీని 'డ్రగ్-ఫ్రీ క్యాంపస్'గా తీర్చిదిద్దేందుకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, పోలీసు అధికారులు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. కళాశాలకు 'డ్రగ్-ఫ్రీ క్యాంపస్' సర్టిఫికెట్‌ను అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, అడిక్షన్ సపోర్ట్, అవసరమైన వృత్తిపరమైన సేవలకు రిఫరల్ సదుపాయాలను ప్రారంభ్ ఫౌండేషన్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఒడిశా--హైదరాబాద్ గంజాయి సరఫరా నెట్‌వర్క్ భగ్నం

**- ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు..**
**- 23.02 కిలోల గంజాయి, రెండు వాహనాలు స్వాధీనం**

నాగోల్ - ప్రభాత సూర్యుడు: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర సరఫరా నెట్‌వర్క్‌ను ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్, నాగోలు పోలీసులు ఛేదించారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 23.02 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.11.51 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 11న ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో నాగోల్ క్రాస్ రోస్ సమీపంలోని భారత్ పెట్రోల్ పంప్ వద్ద ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్, నాగోలు పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఏపి 31ఏజె 3312 నంబర్ గల టయోటా ఇన్నోవా, ఓడి 05ఏఎక్స్ 5899 నంబర్ గల మహీంద్రా ఎక్స్యువి300 వాహనాలను తనిఖీ చేయగా ఇన్నోవా డిక్కీలో నాలుగు, ఎక్స్‌యూవీ 300 డిక్కీలో రెండు ప్యాకెట్లలో దాచిన గంజాయి గుర్తించారు. అరెస్టయిన వారిని ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన త్రినాథ్ నిరికె (40), సోనా హుంతల్ (28)గా గుర్తించారు. వీరిద్దరూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, స్నేహితులైన వీరు ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి రవాణాకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. కోరాపుట్ జిల్లా లాంప్తాపూర్ తహసీల్ పరిధిలోని మల్లిపాడ గ్రామానికి చెందిన 'కమ్ము' అనే వ్యక్తి సూచనల మేరకు గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని వినియోగదారులకు విక్రయించేందుకు గంజాయిని రెండు వాహనాల్లో రహస్యంగా తరలించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న 'కమ్ము' కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. సరఫరా చైన్‌లో ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ ఆపరేషన్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) పర్యవేక్షణలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ (ఐపీఎస్), ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ అదనపు డీసీపీ ఎండీ షాకీర్ హుస్సేన్, నాగోలు పీఎస్ ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రతాప్ రెడ్డి, ఎస్ఓటీ, సరూర్‌నగర్ పోలీసు సిబ్బంది సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.




# విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ పంపిణీ

అలియాబాద్, ఆగస్టు 12 ప్రభాత సూర్యుడు: అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, పాఠశాల విద్యకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్, షూస్, విద్యా సామగ్రి అందించడం ద్వారా వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యలో మరింతగా రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల కల్పనకు మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, పీడీ సాంబశివరావు, శామీర్‌పేట్ ఎంఈఓ కమలాకర్, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్‌రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు : ఎస్సై కృష్ణ ప్రసాద్




ములుగు ఆగస్టు 12, ప్రభాత సూర్యుడు: ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్ పరిధి ధర్మారం గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. పేరూరు ఎస్సై జి. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్లైన్, ఓటీపీ, యూపీఐ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం, డెబిట్ కార్డు వివరాల దుర్వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్లు, వాట్సాప్ సందేశాలు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో పాటు సంబంధిత బ్యాంకును సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎడ్ల గంగరాజు మృతి.

**కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు.**

వెంకటాపురం ఆగస్టు 12, (ప్రభాత సూర్యుడు: , )ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఎదిర గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రైతు ఎడ్ల గంగరాజు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, వెంకటాపురం మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఎదిర గ్రామానికి చేరుకుని గంగరాజు పార్థివదేహంపై పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంగరాజు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వెంకటాపురం పీఏసీఎస్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిడెం మోహన్రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మన్యం సునీల్, దర్ర రవి తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.



# గిరిజన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## ఐటీడీఏ పీవో బి రాహుల్

భద్రాచలం ఆగస్టు 12 ప్రభాత సూర్యుడు:. . తరతరాలుగా వెనుకబడిన గిరిజన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం నాడు భద్రాచలం బి.ఎడ్. కళాశాలలో ఉద్దీపకం--3 కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి అభివృద్ధి చేయడంతో పాటు, వారి అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించేందుకు ఉద్దీపకం--3 కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఉద్దీపకం--3 వర్క్‌బుక్ ద్వారా గణితంలోని ప్రాథమిక భావనలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు.కేవలం పుస్తకంలోని అంశాలను చదివించడం కాకుండా వస్తువులు, చిత్రాలు, బోధనాభ్యసన సామగ్రి వివిధ కార్యకలాపాలు, రోజువారీ జీవితంలోని ఉదాహరణలను ఉపయోగించి గణితాన్ని బోధించాలని తెలిపారు. విద్యార్థులు స్వయంగా చూసి, చేసి, ఆలోచించి, మాట్లాడేలా బోధనా ప్రక్రియను కొనసాగించాలని సూచించారు.ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకోవాలని, ముఖ్యంగా నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తొలగించి, గణితాన్ని సులభమైనది, ఆసక్తికరమైనదిగా భావించేలా బోధన చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.ఉద్దీపకం--3 కార్యక్రమం ద్వారా గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింతగా పెంచేందుకు ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. రెండు రోజుల శిక్షణలో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని వివిధ బోధనా పద్ధతులు, కార్యకలాపాలను అభ్యసించారు.





# దేవరయాంజల్ కోల్డ్ స్టోరేజ్‌లో భారీ అగ్నిప్రమాదం



తూముకుంట ఆగష్టు 12ప్రభాత సూర్యుడు:, : దేవరయాంజల్‌లోని డైరీ క్లాసిక్ ఐస్‌క్రీమ్ కంపెనీకి చెందిన కోల్డ్ స్టోరేజ్‌లో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి.సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజిన్లు, హైడ్రా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు . ప్రస్తుతం మంటలను పూర్తిగా ఆర్పేందుకు సిబ్బంది చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే కోల్డ్ స్టోరేజ్‌లో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలు, నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

# సిండికేట్ దందాను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ?.

**అక్రమంగా ఆటో లో తరలిస్తున్న మద్యం.**
**పట్టించుకోవలసిన అధికారులే వదిలేస్తున్నారా......**




**సీ.ఐ, ఎస్సై ఆఫీస్ కే పరిమితమా.**

సింగరేణి ఆగస్టు 11 ప్రభాత సూర్యుడు ..కారేపల్లి మండల కేంద్రంలో 41 గ్రామపంచాయతీలో ఉండగా కారేపల్లి లో మద్యం షాపులు సిండికేట్ దండగా ఏర్పడి అక్రమంగా ఆటోలో మద్యం ఉదయం 6 గంటల సమయంలో బస్టాండ్ సెంటర్ సమీపంలో ఉన్న బార్ షాప్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా షెటర్ లేపి మద్యం బాక్సులను ఆటోలో నింపుకొని పచ్చని పల్లెల్లో చట్ట విరుద్ధంగా ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా అమ్ముతున్నారు. సంబంధిత శాఖ అధికారులు మద్యం తరలింపు పై పట్టించుకోవడంలేదని మండల ప్రజలు సంబంధిత శాఖపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ సీఐ వివరణ కోరగా..అక్రమంగా ఆటోలు మద్యం తరలిస్తున్న ఆటోలపై చట్టపరమైన చర్యలు చేపడుతామని తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో నిశాంత్

కాప్రా, ఆగస్టు 12 ప్రభాత సూర్యుడు: ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపు మేరకు వంపుగూడ నివాసి, బీజేపీ నాయకుడు నిశాంత్ తన నివాసంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి జాతీయ జెండాను ప్రదర్శించారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని నిశాంత్ పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.



# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

**16న ములుగు జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి**
**తాడ్వాయి సన్నాహక సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ పిలుపు**



ములుగు ఆగస్టు12 ప్రభాత సూర్యుడు: ములుగు జిల్లాలో ఈ నెల 16వ తేదీ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమిష్టిగా కదలాలని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు.తాడ్వాయి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల ముఖ్య నాయకుల సన్నాహక సమావేశానికి పైడాకుల అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, నాయకులు కార్యకర్తల సమన్వయంపై ముఖ్య నాయకులతో చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటన ఎంతో ప్రతిష్టాత్మకమైనదని, పర్యటనను ఘనంగా విజయవంతం చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా భావించాలని అన్నారు.తాడ్వాయి మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనకు ఘన స్వాగతం పలకాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలో సమన్వయంతో పనిచేసి, ప్రజలను పర్యటనలో భాగస్వాములను చేయాలని నాయకులకు సూచించారు.సీఎం పర్యటన విజయవంతం.. ములుగు జిల్లా అభివృద్ధికి మరింత వేగం” అనే సంకల్పంతో కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని, నాయకులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రేగ కళ్యాణి, మండల ఇంచార్జి జగన్మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్రకోల్ల తిరుపతి, గౌరవ అధ్యక్షులు జాలపు అనంతరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర్ రావు, సహకార సంఘ అధ్యక్షులు పులి సంపత్, ముజాఫర్ గార్లతో పాటుగా మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జవహర్‌నగర్ డంపింగ్ యార్డును వెంటనే మూసివేయాలి

**ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తాం**
**మాజీ మేయర్ దొంతగాని శాంతి కొటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఆధ్వర్యంలో మాజీ ప్రజాప్రతినిధుల సమావేశం**

జవహర్‌నగర్, ఆగస్టు 12 ప్రభాత సూర్యుడు: : జవహర్‌నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని కీసర సర్కిల్ వద్ద ఉన్న రాంకీ ఇంటిగ్రేటెడ్ చెత్త డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయాలని మాజీ మేయర్ దొంతగాని శాంతి కొటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.బుధవారం ప్రగతినగర్‌లోని నీలం రాంచంద్రయ్య భవన్‌లో జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ఆహ్వానం మేరకు మాజీ ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు సమస్యపై విస్తృతంగా చర్చించారు.డంపింగ్ యార్డు కారణంగా ప్రజారోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాల కాలుష్యం, దుర్వాసన, గాలి కాలుష్యం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. డంపింగ్ యార్డు ఎత్తివేత ఉద్యమాన్ని ప్రజాక్షేత్రంలో మరింత ఉధృతం చేసేందుకు ఆగస్టు 14న మరోసారి కార్పొరేటర్ల సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జీవించే హక్కు కోసం తమ మద్దతు కొనసాగుతుందని మాజీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు






# విద్యుత్ ఘాతానికి మృతి చెందిన బీట్ ఆఫీసర్.

**నివాళులర్పించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్.**

సింగరేణి ఆగస్టు 12 ప్రభాత సూర్యుడు: సింగరేణి మండల మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవుల నాయక్ తనయుడు భానోత్ నవీన్ బీట్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తూ విద్యుత్ ఘాతానికి మృతి చెందగా విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండా గ్రామపంచాయతీలో వారి దహన సంస్కరణ నిర్వహించగా వారి మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మృతి చెందడం బాధాకరమంటూ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ స్థానికులు ద్వారా విషయం తెలుసుకొని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన బీట్ ఆఫీసర్ మృతికి నివాళులర్పిస్తూ వారి తండ్రి కి ప్రగడ సానుభూతి తెలిపారు.





# ఇటిక్యాలలో నిఘా వ్యవస్థ పటిష్టం.. సీసీ కెమెరాల ప్రారంభం



ప్రభాత సూర్యుడు: సిద్ధిపేట: గ్రామ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ఇటిక్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. జగదేవపూర్ ఎస్సై కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన ప్రాంతాలు, ముఖ్య కూడళ్లు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలను సీసీ కెమెరాల పరిధిలోకి తీసుకురావడంతో భద్రతా వ్యవస్థ మరింత పటిష్టం కానుందని ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న వారు అన్నారు. కెమెరాల నిరంతర నిర్వహణ, పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు పోలీసులకు, గ్రామపంచాయతీకి ప్రజలు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజల్లో భద్రతా భావం పెరగడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని గ్రామ పెద్దలు, ప్రజలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీనరాజలింగం, ఉపసర్పంచ్ నరేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, వార్డు సభ్యులు మెట్టు స్వామి, అఖిల భాస్కర్, మమత ప్రకాష్, లక్ష్మి యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రేఖ, కిట్టు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నూకలమర్రి గ్రామంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం




ప్రభాత సూర్యుడు: వేములవాడ :స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమంలో జాతీయ జెండాను చేతబూని దేశభక్తిని చాటుతూ బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జైహింద్ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవడంతో పాటు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత సార్వభౌమత్వం దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.నేటి యువత దేశ చరిత్ర స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలుసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవిస్తూ దేశం ముందు మనం తరువాత అనే భావనతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం అధికార ప్రతినిధి సుంకరి నరేందర్ మండల ప్రధాన కార్యదర్శివనపర్తిపరశురాములు తోట శేఖర్,మండల ఉపాధ్యక్షులు కుంటి వంశీకృష్ణ, మండల కార్యదర్శి రాజేందర్, బూత్ అధ్యక్షులు లింగంపల్లి కిషోర్, సీనియర్ నాయకులు చిట్టి పల్లి రవి కిషోర్, గుడిసె రమేష్, జంగం వంశీ, సమోజు గౌతమ్, ఆవునూరి తిరుపతి, నేదూరి లక్ష్మణ్,మారాజు దిలీప్, జంగం సాయి, శ్రీరామోజు శివ,నూకలమర్రి గ్రామ ప్రజలు,యువకులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆది శ్రీనివాస్‌పై బురదజల్లొద్దు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

ప్రభాత సూర్యుడు: వేములవాడ:వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. వేముల వాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తుం మధు మాట్లాడారు. హిందూ మతాన్ని అడ్డుపెట్టుకుని గెలిచిన బీజేపీ నాయకులు తమ స్థాయి మరచి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దేవుని పేరుతో వందల కోట్లు దండుకున్నది బీజేపీ నేతలేనని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజన్న ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ పట్టణాభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు.



# ఆ డైరెక్టర్ పేరు వెనుక స్టోరీ హాట్ టాపిక్

సాలిడ్ ఆన్సర్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, రితికా నాయక్ జంటగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన వినూత్న హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'.



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, రితికా నాయక్ జంటగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన వినూత్న హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. ఆగస్ట్ 7న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సక్సెస్ ఊపులో ఉన్న మేర్లపాక గాంధీ ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్, కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను తుపాకీ న్యూస్ కి ఇచ్చిన ఎక్స్ క్లూజివ్ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ముఖ్యంగా తన పేరు 'చే గువేరా' నుంచి 'గాంధీ'గా ఎలా మారిందనే విషయాన్ని సరదాగా వెల్లడించడంతో ఆ స్టోరీ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తుపాకీ న్యూస్ కి ఎక్స్ క్లూజివ్ ఇంటర్వ్యూలో యాంకర్ తన పేరు వెనుక ఉన్న రహస్యం గురించి అడగగా, గాంధీ ఆసక్తికరంగా సమాధానం చెప్పారు. తన తండ్రి ప్రముఖ నవలా రచయిత మేర్లపాక మురళికి కమ్యూనిజం భావజాలం, ఆ ఫిలాసఫీ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. ఇక ఆ ప్రభావంతోనే చిన్నప్పుడు తనకు 'చే గువేరా' అని పేరు పెట్టారట. అయితే ఊరిలో ఉన్నవాళ్లకు ఆ పేరు నోరు తిరక్క జగ్గువేరా, జగ్గు అని రకరకాలుగా పిలిచేవారని, అందరికీ సమాధానం చెప్పలేక విసుగు వచ్చి ఒకరోజు నాన్నే తన పేరును 'గాంధీ'గా మార్చారని నవ్వుతూ వెల్లడించారు. డైరెక్టర్ అవ్వడానికి కారణం నాన్నే: రచయితగా, దర్శకుడిగా తాను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి మూలకారణం తన తండ్రేనని గాంధీ చెప్పుకొచ్చారు. చిన్నతనం నుంచే పుస్తకాలు చదివించడం, సాహిత్యంపై ఆసక్తి పెంచడం ద్వారా తనకు సినిమాపై పిచ్చి మొదలైందన్నారు. ఇక ఎల్వీ ప్రసాద్ ఫిల్మ్ స్కూల్‌లో చేర్పించడమే కాకుండా, ఇప్పుడు కూడా తాను స్క్రిప్ట్ పూర్తి చేయగానే మొదట తండ్రికే ఇస్తానని చెప్పారు. ఇద్దరం కలిసి చర్చించుకుని, అవసరమైన మార్పులు చేసుకుంటామని తెలిపారు. సినిమా ఆలస్యమవ్వడానికి అసలు కారణాలు: 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' తర్వాత మళ్లీ 'కొరియన్ కనకరాజు' సినిమాకి మధ్య నాలుగేళ్ల గ్యాప్ రావడంపై గాంధీ స్పందించారు. ఇక కథ రాయడానికి, సెట్ అవ్వడానికి ఏడాది పట్టిందని చెప్పారు. ఆ తర్వాత హీరో వరుణ్ తేజ్ బిజీగా ఉండటం, కమెడియన్ సత్య డేట్లు దొరక్కపోవడం, అలాగే కొరియా నుంచి నటులను ఇక్కడికి రప్పించడం, వీసా సమస్యలు రావడం వల్ల అనుకోకుండా లేట్ అయిందని వివరించారు. గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చిన గాంధీ: 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి బ్యాక్ టు బ్యాక్ బ్లాక్‌బస్టర్ హిట్ల తర్వాత మేర్లపాక గాంధీ మార్క్ కామెడీని ప్రేక్షకులు బాగా మిస్ అయ్యారు. ఇక ఇప్పుడు 'కొరియన్ కనకరాజు'తో ఆయన మళ్లీ తన పాత ఫామ్‌లోకి వచ్చి, థియేటర్లలో నవ్వుల వర్షం కురిపిస్తున్నారు. వైవిధ్యమైన కాన్సెప్ట్, తమన్ ఆర్ఆర్, సత్య కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. పేరు మారినా తనలో ఉన్న నైపుణ్యం, సినిమాపై ఉన్న ప్రేమ మారలేదని మేర్లపాక గాంధీ ప్ర నిరూపించారు. తండ్రి ఇచ్చిన ప్రోత్సాహంతో పరిశ్రమలోకి వచ్చి, తనకంటూ ప్రత్యేకమైన కామెడీ మార్క్‌ను క్రియేట్ చేసుకున్నారు. ఇక 'కొరియన్ కనకరాజు' సక్సెస్‌ను ఆస్వాదిస్తున్న ఆయన, భవిష్యత్తులో కూడా ఇలాంటి అద్భుతమైన వినోదాత్మక చిత్రాలను అందించి ప్రేక్షకులను అలరించాలని ఆశిద్దాం.

# సంగీత దర్శకుడి బయోపిక్ లో సంచలన మార్పులు!



ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.డి. బర్మన్ (పంచమ్ దా) జీవిత చరిత్ర ఆధారంగా నీరజ్ పాండే ఓ చిత్రాన్ని తెకెక్కించడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.డి. బర్మన్ (పంచమ్ దా) జీవిత చరిత్ర ఆధారంగా నీరజ్ పాండే ఓ చిత్రాన్ని తెకెక్కించడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. బర్మన్ పాత్రలో ఇమ్రాన్ హష్మి ఎంపికైనట్లు వార్తలొచ్చాయి. బర్మన్ పాత్రకు హష్మీ పర్ఫెక్ట్ గా సెట్ అవుతున్నాడని పట్టుబట్టి మరీ ఎంపిక చేసినట్లు బాలీవుడ్ మీడియాలో కోడై కూసింది. అయితే ఇప్పుడా పాత్రకు ఫర్హాన్ అక్తర్ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అలాగే సూపర్ స్టార్ రాజేష్ ఖన్నా పాత్ర కోసం బాలీవుడ్ అగ్రనటుడు అక్షయ్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ భారీ ప్రాజెక్ట్ ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ పాత్ర అతిథి పాత్ర మాత్రమే కాదు. ఇదొక ఎక్స్‌టెండెడ్ క్యామియో అని చిత్ర బృందం వెల్లడించింది. 10 రోజుల పాటు ఈ పాత్ర కోసం షూటింగ్‌లో అక్షయ్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ అక్టోబర్ లో ప్రారంభం కానుంది. అక్షయ్ కుమార్‌ను ఈ పాత్రకు ఎంపిక చేయడం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆయనకున్న వ్యక్తిగత అనుబంధం అని సినీ వర్గాలు చెబుతున్నాయి. అక్షయ్ కుమార్, రాజేష్ ఖన్నా కుమార్తె ట్వింకిల్ ఖన్నాను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.అలాగే రాజేష్ ఖన్నా మాజీ భార్య డింపుల్ కపాడియా, అక్షయ్‌కు అత్తగారు కావడంతో ఈ కుటుంబ అనుబంధం పాత్రకు మరింత సహజత్వాన్ని తెస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. రాజేష్ ఖన్నా .. ఆర్.డి. బర్మన్ మధ్య ఉన్న వృత్తిపరమైన అనుబంధం హిందీ చిత్ర పరిశ్రమలో చాలా ప్రత్యేకమైనది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఎన్నో చిరస్మరణీయమైన పాటలు, సినిమాలు వచ్చాయి. ఆనాటి స్నేహాన్ని , సృజనాత్మక భాగస్వామ్యాన్ని వెండితెరపై పునసృష్టించడానికి అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చిత్ర బృందం భావిస్తోంది.రాజేష్ ఖన్నా అంటే అక్షయ్ కుమార్‌కు మొదటి నుండి ఎంతో అభిమానం. తన మామగారైన రాజేష్ ఖన్నా పాత్రను పోషించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని అక్షయ్ కూడా ఉత్సాహంగా ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రం ద్వారా మరోసారి అక్షయ్ కుమార్ .. నీరజ్ పాండే జంట -స్పెషల్ 26-, -బేబీ- వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత మళ్లీ కలిసి పని చేస్తుండటం విశేషం.

# బిగ్ అప్‌డేట్ రాబోతుందా? 'జై హనుమాన్' కాస్టింగ్ పై హీట్ బజ్!

టాలీవుడ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న పౌరాణిక సూపర్‌హీరో మూవీ 'జై హనుమాన్' ఒకటి.



టాలీవుడ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న పౌరాణిక సూపర్‌హీరో మూవీ 'జై హనుమాన్' ఒకటి. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తుండగా, యంగ్ హీరో తేజ సజ్జ హీరోగా కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా పట్టా లెక్కబోతోంది. ఈ మేరకు ఈ సినిమా కాస్టింగ్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, సోషల్ మీడియాలోనూ, థియేటర్లలోనూ వరుస హిట్లతో దూసుకుపోతున్న ప్రముఖ నటి వామికా గబ్బి ఈ భారీ చిత్రంలో ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఇటీవల కోలీవుడ్ హిట్ మూవీ 'డిసి'లో ఆమె చూపించిన నటనకు ప్రేక్షకుల నుంచి విశేషమైన ప్రశంసలు దక్కాయి. ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న సమయంలోనే ఆమెకు 'జై హనుమాన్'లో ఆఫర్ వచ్చిందనే వార్త ఫ్యాన్స్‌లో భారీ ఎగ్జైట్‌మెంట్‌ను నింపుతోంది.మైత్రీ మూవీస్ భారీ ప్లానింగ్: ఈ పౌరాణిక విజువల్ వండర్‌ను ఎక్కడా తగ్గేదే లేదనేలా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కీరవాణి సంగీతం తోడైతే ఈ సినిమాలోని భక్తి, యాక్షన్ సన్నివేశాలు నెక్స్ట్ లెవెల్‌కి వెళ్లడం ఖాయమని క్రీడా, సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ప్రశాంత్ వర్మ విజన్, మైత్రీ ప్రొడక్షన్ వాల్యూస్ కలిసి ఈ సినిమాను పాన్ వరల్డ్ స్థాయిలో నిలబెట్టబోతున్నాయి.ప్రస్తుతం వామికా గబ్బి చేరికపై ప్రచారం జోరుగా సాగుతున్నప్పటికీ, చిత్ర యూనిట్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఒకవేళ రిషబ్ శెట్టి, తేజ సజ్జలతో పాటు వామికా కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమైతే, సినిమా కాస్టింగ్ ప్రాముఖ్యత మరింత పెరుగుతుంది. ఇక ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న ఈ రెండో భాగంపై దేశవ్యాప్తంగా ఇప్పటికే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'హను-మాన్' సాధించిన సంచలన విజయం తర్వాత వస్తున్న 'జై హనుమాన్' పై అటు ట్రేడ్ వర్గాల్లో, ఇటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక రిషబ్ శెట్టి నాయకత్వంలో, కీరవాణి సంగీతంతో రాబోతున్న ఈ చిత్రంలోకి వామికా గబ్బి రాక నిజమైతే సినిమా రేంజ్ మరింత పెరుగుతుంది. త్వరలోనే మైత్రీ మూవీ మేకర్స్ ఈ కాస్టింగ్ బజ్ పై అధికారిక ప్రకటన ఇచ్చి అభిమానుల ఉత్కంఠకు తెరదించుతారని ఆశిద్దాం.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్'కి త్రివిక్రమ్ స్టాంప్.. హిట్ గ్యారెంటీ!

ఈ వారంలో థియేటర్స్ లో ఆడియెన్స్ ని అలరించేందుకు వస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా మమితా బైజు హీరోయిన్ గా దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా ఒకటి. మంచి అంచనాలు సెట్ చేసుకున్న ఈ తమిళ్ సినిమా తెలుగు డబ్బింగ్ లో కూడా రాబోతుంది.అయితే ఈ చిత్రం గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిన్న జరగగా ఈ సినిమా రిజల్ట్ పై నిర్మాత నాగవంశీ ధీమా వ్యక్తం చేశారు. తమ ఆస్థాన దర్శకుడు త్రివిక్రమ్ గారికి ఈ సినిమా చూపించామని సినిమా త్రివిక్రమ్ గారికి చాలా నచ్చింది అని తమ బ్యానర్ లో త్రివిక్రమ్ గారికి చూపించి ఆయనకి నచ్చిన ప్రతీ సినిమా ఫెయిల్ అవ్వలేదు అని కన్ఫర్మ్ చేశారు. సో అలానే విశ్వనాథ్ అండ్ సన్స్ కూడా హిట్ గ్యారెంటీ అని త్రివిక్రమ్ స్టాంప్ తో ఫ్యాన్స్ కి ఒక భరోసా అందించారు. సో సినిమా ఎలా ఉంటుంది అనేది ఈ 14తో తేలిపోతుంది.




# "ఇరుముడి" ట్రైలర్ పైనే అందరి కళ్ళు!




మాస్ మహారాజ రవితేజ హీరోగా ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన అవైటెడ్ ఎమోషనల్ థ్రిల్లర్ సినిమా ఇరుముడి. ఎప్పుడు నుంచో మంచి బజ్ నెలకొన్న ఈ సినిమాని మేకర్స్ ఈ నెల లోనే గ్రాండ్ గా విడుదలకి తీసుకొస్తున్నారు. అయితే ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న అభిమానులకి మేకర్స్ ట్రైలర్ ట్రీట్ ని ఓ వారం ముందే కన్ఫర్మ్ చేసిన సంగతి తెలిసిందే.అయితే ఈ ట్రైలర్ ని మేకర్స్ నేడు సాయంత్రం విడుదల చేస్తుండగా ఫ్యాన్స్ సహా జెనరల్ ఆడియెన్స్ కూడా దీని కోసమే ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీనితోనే సినిమాపై మరింత క్లారిటీ రానుంది కాబట్టి అందరి దృష్టి దీనిపైనే పడింది. సో ఇదెలా ఉంటుందో తెలియాలి అంటే ఈ సాయంత్రం వరకు ఆగక తప్పదు. ఇక ఈ సినిమాకి జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నాడు అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

# ఏడాదికి ఒక్క సినిమా కూడా లేదా? చరణ్ ఫిల్మోగ్రఫీపై ఫ్యాన్స్ రియాక్షన్!

ఒకప్పుడు మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు రిలీజ్ చేస్తూ అభిమానులను అలరించేవాళ్ళు. సూపర్ స్టార్ కృష్ణ, మెగాస్టార్ చిరంజీవి లాంటి దిగ్గజాలు దీనిని చేసి చూపించారు. ఒకప్పుడు మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు రిలీజ్ చేస్తూ అభిమానులను అలరించేవాళ్ళు. సూపర్ స్టార్ కృష్ణ, మెగాస్టార్ చిరంజీవి లాంటి దిగ్గజాలు దీనిని చేసి చూపించారు. కానీ ఇప్పుడు పాన్ ఇండియా ట్రెండ్ వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రెండేళ్లకు లేదా మూడేళ్లకు ఒక్క సినిమా వస్తేనే ఎక్కువైపోయింది. తాజాగా రామ్ చరణ్ ఫిల్మోగ్రఫీ, ఆయన చేస్తున్న సినిమాల స్పీడ్‌పై సోషల్ మీడియాలో మెగా అభిమానులు , సినీ ప్రేమికుల మధ్య ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. 19 ఏళ్ల కెరీర్.. కేవలం 16 సినిమాలు మాత్రమే: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చిత్ర పరిశ్రమలోకి వచ్చి దాదాపు 19 సంవత్సరాలు పూర్తయింది. అయితే ఇప్పటివరకు ఆయన నటించిన చిత్రాలు కేవలం 16 మాత్రమే కావడం గమనార్హం. ఇందులో 'ఆచార్య'లో చేసిన అతిథి పాత్ర కూడా ఉంది. అంటే ఏడాదికి ఒకటి కూడా లేదు. భారీ అంచనాలతో వచ్చిన 'గేమ్ ఛేంజర్' బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో, అంత సమయం కేటాయించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక మొన్న వచ్చిన పెద్ది మూవీ ఎంతో కష్టపడితే కాస్త ఆ మాత్రం రిజల్ట్ వచ్చింది. సోషల్ మీడియా ట్రోలింగ్స్: చరణ్ సినిమా షూటింగ్ నెమ్మదిగా సాగుతుండటంతో, సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలై కిరణ్ అబ్బవరం తో పోలికలు చేస్తూ పోస్టులు పెరుగుతున్నాయి.. ఆరేళ్ల క్రితం పరిశ్రమలోకి వచ్చిన యంగ్ హీరో కిరణ్ అబ్బవరం అప్పుడే 15 సినిమాలు పూర్తి చేయగా, చరణ్ 19 ఏళ్లలో 16 సినిమాలు మాత్రమే చేశారంటూ ట్రోలర్స్ కామెంట్లు చేస్తున్నారు. ఇక ఈ పోలిక సమంజసం కాకపోయినా, చరణ్ వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందనేది అందరి అభిప్రాయం.



కథల ఎంపికపై చరణ్ పునరాలోచించుకోవాలా?: డైరెక్టర్ల బ్రాండ్ ఇమేజ్‌ను మాత్రమే నమ్ముకోకుండా, తన సొంత ఇమేజ్ మరియు మార్కెట్‌కు సరిపోయే కథలను ఎంచుకోవడంపై చరణ్ దృష్టి పెట్టాలని విశ్లేషకులు భావిస్తున్నారు. దర్శకులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో పాటు అవసరమైనప్పుడు మార్పులు చేర్పులు సూచించడం ముఖ్యం. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాలో చిరంజీవి గారు వెంకటేష్ పాత్రను సూచించినట్లే, కథలో అవసరమైన సలహాలు ఇవ్వడం వల్ల సినిమా అవుట్‌పుట్ మెరుగ్గా వస్తుంది. నిజానికి ఈ నెమ్మదితనం ఒక్క రామ్ చరణ్ సమస్య మాత్రమే కాదు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా పాన్ ఇండియా ప్రాజెక్టుల వల్ల చాలా సమయం తీసుకుంటున్నారు. ఉన్నంతలో రెబల్ స్టార్ ప్రభాస్ మాత్రమే విభిన్నమైన కథలను ఎంచుకుంటూ వరుసగా సినిమాలు షూటింగ్స్ పూర్తి చేస్తూ కాస్త బెటర్‌గా కనిపిస్తున్నారు. స్టార్ హీరోలు పాన్ ఇండియా సినిమాలు చేయడం మంచిదే అయినా, మరీ ఇన్నేళ్ల సమయం కేటాయించడం వల్ల అభిమానుల నిరీక్షణ భారమవుతోంది. రామ్ చరణ్ తన తదుపరి ప్రాజెక్టు సుకుమార్ తో చేయబోయే 'ఆర్సి 17' చిత్రాలను వేగంగా పూర్తి చేసి, వరుస సినిమాలతో అలరించాలని మెగా ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555